

ఉద్యాన్ పార్కును ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బోర్డు నామినేటెడ్ మెంబర్ రామకృష్ణ

కంటోన్మెంట్ ఉద్యాన్ పార్కు ప్రారంభం

మారేడ్‌పల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ మహేంద్ర హిల్స్ కాలనీలో ఐదు కోట్ల రూపాయల వ్యయంతో నాలుగు వేల చదరపు గజాలలో అన్ని హంగులతో నిర్మించిన కంటోన్మెంట్ ఉద్యాన్ పార్కును కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై గురువారం ప్రారంభించారు. ఉద్యాన్ పార్కులో ఓపెన్ జిమ్, చిల్డ్రన్ పార్కు, స్కేటింగ్ స్టేడియం, వాకింగ్ ట్రాక్, పచ్చదనం కలిగిన మైదానాన్ని స్థానిక కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు ప్రెసిడెంట్ కె.సోమశేఖర్, బోర్డు నామినేటెడ్ మెంబర్ జి.రామకృష్ణ, సీఈఓ మధుకర్ నాయక్, ఇంజనీర్లు, అధికారులు, నాయర్, గోపాలదాస్ కృష్ణ, ఉమాశంకర్, ఫణికుమార్, దినేష్, ఎం.రాజకుమార్, దేవేందర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సూచనలతో బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో

● ఎంపీ డాక్టర్ లక్ష్మణ్



ఉపాధ్యాయుల అభిప్రాయాలను డ్రాప్ బాక్స్ ద్వారా సేకరిస్తున్న డాక్టర్ లక్ష్మణ్

సికింద్రాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజల సలహాలు, సూచనలతోనే బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో రూపొందిస్తామని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ తెలిపారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి బీజేపీ మేనిఫెస్టో రూపొందించనున్న నేపథ్యంలో అన్నివర్గాల ప్రజల సూచనలు తీసుకోవడంలో భాగంగా గురువారం సికింద్రాబాద్ ఆర్‌జీఆర్ సిద్ధాంతి కళాశాలలో అధ్యాపకులు, సిబ్బంది అభిప్రాయాలను డ్రాప్‌బాక్స్ ద్వారా సేకరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, కళాశాల ఛైర్మన్ పి.ఎల్.శ్రీనివాస్, ఓబీసీ మహిళా మోర్చా అధికార ప్రతినిధి అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా సమ్మేళనాలను విజయవంతం చేయాలి

బర్కత్‌పుర, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో నిర్వహించే ఓబీసీ మోర్చా సమ్మేళనాలను విజయవంతం చేయాలని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యులు, రాజ్యసభసభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఈ నెల 10న సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నామని, దీనిలో కులసంఘాలను భాగస్వాములను చేయాలని సూచించారు. గురువారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ టి.రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షత వహించగా ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, నాయకులు చంద్రశేఖర్, ఎడెల్లి అజయ్ కుమార్, సి.కృష్ణగౌడ్, సందీప్‌సాయి, వినయ్‌కుమార్, లక్ష్మీనారాయణ, మేకల సారంగపాణి, పూస రాజు, సలంద్రి శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'మతి స్థిమితం కోల్పోయి మాట్లాడుతున్న కేటీఆర్'

హైదరాబాద్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు గజ్జెల కాంతం విమర్శించారు. రాజకీయాలపై కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. గురువారం గాంధీభవన్‌లో గజ్జెల కాంతం విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ తెచ్చిన అన్ని చట్టాలకు మద్దతు ఇచ్చిన బీఆర్‌ఎస్ నేతలు కాంగ్రెస్‌ను విమర్శించడం విడ్డూరమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే హక్కు కేటీఆర్‌కు లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసమే రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీని కలిశారని.. ప్రధానిని ఒక ముఖ్యమంత్రి పెద్దన్న అంటే తప్పేమీ లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల అవసరాలు, రాష్ట్ర అభివృద్ధి కోసమే సీఎంగా రేవంత్‌రెడ్డి పీఎం మోదీకి వినతిపత్రాలు ఇచ్చారన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటమి భయం పట్టుకుందని అందుకే బీఎస్పీతో సైతం పొత్తుకు సిద్ధపడుతున్నారని విమర్శించారు.

నిరుద్యోగ అభ్యర్థుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకట్

చిక్కడపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ అభ్యర్థుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. గురువారం రాత్రి చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయంలో పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో ఆయన మాట్లాడారు. సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పోస్టుల సంఖ్యను పెంచేలా ప్రయత్నిస్తానన్నారు.

రసాయనశాస్త్రంలో విస్తృత పరిశోధనలు జరగాలి



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న ప్రొ. గోవర్ధన్ మెహతా తదితరులు

తార్నాక, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని రసాయనశాస్త్రంలో పరిశోధనలు మరింత విస్తృతంగా జరపాలని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ) మాజీ వీసీ ప్రొ.గోవర్ధన్ మెహతా అన్నారు. నేచర్ ఇన్‌స్పైర్డ్ ఇనిషియేటివ్స్ ఇన్ కెమికల్ ట్రెండ్స్ అనే అంశంపై తార్నాకలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ)లో మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొ. గోవర్ధన్ మెహతా మాట్లాడుతూ మానవజాతి ఆరోగ్య పరిరక్షణకు రసాయనశాస్త్రం, జీవశాస్త్రంలో సమన్వయంతో కలిసి పనిచేసినప్పుడే అద్భుత ఫలితాలను సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. సదస్సు కన్వీనర్ డా. సీహెచ్ రాజిరెడ్డి మాట్లాడుతూ భవిష్యత్‌తరాలకు ఉపయోగపడేవిధంగా నూతన ఆవిష్కరణలు ఏవిధంగా చేయాలి అనే దానిపైన మూడురోజుల అంతర్జాతీయ సదస్సులో విస్తృతంగా చర్చించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ డా.చంద్రశేఖర్, ఐఐసీటీ డైరెక్టర్ డా.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిద్దెతోటలు సాగుచేసిన వారికి పురస్కారాలు

హైదరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మిద్దెతోటలు సాగుచేసిన వారికి రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పురస్కారాలు అందజేశారు. హైదరాబాద్‌లోని ఎఫ్‌టీసీసీఐలో గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని 24 మందికి అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన రైతునేస్తం కార్యక్రమంలో మిద్దెతోటల అంశాన్ని కూడా చేరుస్తామని హామీ ఇచ్చారు. మహిళలు మిద్దెతోటలపై దృష్టిపెట్టాలని, ఇంటిల్లిపాదికి అవసరమయ్యే కూరగాయలు పండించాలని, ఆరోగ్య తెలంగాణను నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతునేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ వెంకటేశ్వరరావు, కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి, తుమ్మేటి రఘోత్తంరెడ్డి, పిన్నక పద్మ పాల్గొన్నారు.

పిస్తాహౌజ్‌లో దాడికి పాల్పడిన ఆరుగురి రిమాండ్

రాజేంద్రనగర్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఈ నెల 3న అర్ధరాత్రి 12:30 గంటలకు ఉప్పర్‌పల్లి పిస్తాహౌజ్‌లోకి వెళ్లి అక్కడ భోజనాలు చేస్తున్న కస్టమర్లతోపాటు సిబ్బందిపై దాడి చేసిన కేసులో ఆరుగురు వ్యక్తులను అత్తాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రామిరెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. నౌ నంబర్‌కు చెందిన అయూబ్, తాజుద్దీన్, బాబా, షరీఫ్, బబ్లూ అలియాస్ ఇమ్రాన్, ముస్తాఫా పిస్తా హౌజ్‌కు వెళ్లి అర్ధరాత్రి బిర్యానీ అడిగారు. సమయం మించిపోయింది. బిర్యానీ లేదని అక్కడున్న మేనేజర్ మతిన్ తెలిపాడు. దీంతో రెచ్చిపోయిన ఆ ఆరుగురు వ్యక్తులు హోటల్‌లో ఉన్నవారిపై, సిబ్బందిపై దాడి చేశారు. మేనేజర్ మతిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అత్తాపూర్ పోలీసులు ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

శివరాత్రికి ముస్తాబైన ఆలయాలు

మహాశివరాత్రికి ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లోని ఆలయాలు ముస్తాబయ్యాయి. రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ముషీరాబాద్‌లోని గౌరీశంకర ఆలయం, చిక్కడపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, జెమినీ కాలనీలోని శివాలయం తదితర ఆలయాల్లో నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.
- ముషీరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి)



వెండితో చేసిన పరమశివుడి ప్రతిరూపం

వేంకటేశ్వరాలయంలో..

చిక్కడపల్లి: చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలోని శివాలయంలో మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం ప్రత్యేకపూజా కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ వ్యవస్థాపక వంశీయుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో కె.రామాంజనేయులు తెలిపారు. చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీఆంజనేయస్వామి ఆలయం ఆవరణలో ఉన్న శివాలయంలో ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నామని ఆలయ ఈవో మాచర్ల దేవనాథం తెలిపారు.

వెండి ప్రతిరూపం బహూకరణ

ముషీరాబాద్: ముషీరాబాద్‌కు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, గంగపుత్ర సంఘం మాజీ ఉపాధ్యక్షుడు మీసాల శివప్రసాద్, గాండ్ల శివకృష్ణ కిలో వెండితో పరమశివుని ప్రతిరూపం తయారు చేయించారు. దీన్ని ముషీరాబాద్‌లోని జెమినీ కాలనీలోని శివాలయంలో స్వామికి శుక్రవారం బహూకరించనున్నట్లు వారు తెలిపారు.

ఆలయాల వద్ద బందోబస్తు : సీఐ

బర్కత్‌పుర: ఆలయాల వద్ద పటిష్ఠమైన బందోబస్తు కల్పించనున్నట్లు కాచిగూడ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. సీఐని గురువారం జమల్‌బస్తీ గౌడ సంఘం అధ్యక్షుడు బి.కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో శాలువా, పూలబొకేతో సత్కరించారు. కార్యక్రమంలో జమల్‌బస్తీ గౌడ సంఘం ఉపాధ్యక్షుడు కె.సత్తయ్యగౌడ్, కార్యదర్శి ఎం.జ్ఞానేశ్వర్‌గౌడ్, ప్రతినిధులు మహేందర్‌గౌడ్, ప్రభాకర్‌గౌడ్, వీరేశంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ముస్తాబైన ముషీరాబాద్‌లోని గౌరీశంకర ఆలయం

మజ్జిగ వితరణ

బ్రహ్మకుమారీస్ రాజయోగ మెడిటేషన్ రాంనగర్ శాఖ ఆధ్వర్యంలో గురువారం రాంనగర్ గుండు చౌరస్తాలో ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శన కార్యక్రమంతో పాటు ప్రజలకు మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు శ్రీలత, సరోజిని, భద్రప్ప, చాణక్య, వెంకన్న, జ్యోత్స్న, బాల్‌రాజ్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అఖండ జ్యోతియాత్ర

బర్కత్‌పుర: నేటి నుంచి 11వ తేదీ వరకు శ్రీలక్ష్మీనరసింహస్వామి అఖండ జ్యోతియాత్ర నిర్వహిస్తున్నట్లు అఖండ జ్యోతియాత్ర కమిటీ చైర్మన్ సద్ది వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులు దుగ్యాల పవన్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి పడాల శ్రీకాంత్, అసిస్టెంట్ కార్యదర్శి ఎస్.పి.ఉపేందర్‌రావు తెలిపారు. నగరంలోని బర్కత్‌పుర యాదాద్రి భవనం నుంచి శనివారం ఉదయం 10.30 గంటలకు ఈ యాత్ర ప్రారంభమవుతుందన్నారు. గురువారం యాదాద్రి భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నారాయణగూడ, ఆర్టీసీక్రాస్‌రోడ్స్, ముషీరాబాద్, తార్నాక, ఉప్పల్, ఘట్‌కేసర్, భువనగిరి మీదుగా ఈ నెల 11న యాదాద్రి చేరుకుంటుందన్నారు. ఈ యాత్రను కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, వీర్ల ఐలయ్య, అనిల్‌కుమార్‌రెడ్డి, యాదాద్రి ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈవో ఎం.రామకృష్ణరావులు ప్రారంభిస్తారని వారు తెలిపారు.

'ఏడుపాయల' అమ్మకు వారికి పట్టు వస్త్రాలు : టీడీపీ

నల్లకుంట: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు ఆదేశానుసారం తెలంగాణ రాష్ట్రంలోని మెదక్ జిల్లాలో అత్యంత ప్రసిద్ధిగాంచిన వనదుర్గా మాత ఏడుపాయల జాతరలో అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నట్లు టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జె.దశరథ్ తెలిపారు. గురువారం నల్లకుంటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ప్రతియేటా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్నామన్నారు.

గురుకులాల్లో 9,210 పోస్టులను భర్తీ చేయాలి: ఆర్.కృష్ణయ్య



ధర్నాలో మద్దతు తెలియజేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, ఓయూ జేఏసీ నేత దత్తాత్రి, అభ్యర్థులు

కవాడిగూడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): బ్యాక్‌లాగ్ పోస్టులు లేకుండా గురుకులాల్లో 9,210 పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, గత ప్రభుత్వం రద్దు చేసిన ఆర్ఓను కొనసాగించి ప్రత్యేక ఆప్షన్ ఇవ్వాలని ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఇందిరాపార్కు వద్ద ధర్నాచౌక్‌లో తెలంగాణ గురుకుల అభ్యర్థులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ పీజీటీ పోస్టులను భర్తీ చేయడం వల్ల మెరిట్‌లో ఉన్న అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని, వారికి న్యాయం చేసే విధంగా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీఆర్‌ఈఐ-ఆర్‌బీ వెలువరించిన అన్ని నోటిఫికేషన్లలో పైస్థాయి పోస్టుల నుంచి క్రిందిస్థాయి వరకు భర్తీ వెంటనే చేయాలన్నారు. ఈ ధర్నాలో ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ నేత దత్తాత్రి, గురుకుల టీచర్స్ అభ్యర్థులు సైదులు, ఎ.రాజు, అశోక్, జయశంకర్, సత్యనారాయణ, కాంతారావు, ఆస్మాతోపాటు అభ్యర్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్రంలో విద్యా వ్యవస్థ నిర్వీర్యం : ఎంపీ లక్ష్మణ్

ముషీరాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యా వ్యవస్థ నిర్వీర్యమైందని ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ ఆరోపించారు. గురువారం ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మొరం బొంద ప్రభుత్వ పాఠశాలలను విద్యామండలి డిప్యూటీ ఈవో చిరంజీవి, ఐవోఎస్‌లు స్వరూపారాణితో కలిసి డాక్టర్ లక్ష్మణ్ సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తన ఎంపీ నిధుల నుంచి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు, ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ నవీన్‌గౌడ్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బద్రినారాయణ, బీజేవైఎం నగర కార్యదర్శి అనిల్, పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మణ్, స్కూల్ కార్యదర్శి రత్నం, ప్రధానోపాధ్యాయుడు జాబేర్ పాల్గొన్నారు.

30ఏళ్ల రోడ్డు సమస్య పరిష్కారం : ఎమ్మెల్యే

ముషీరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ హౌస్ వద్ద అధ్వానపు రోడ్డుతో 30 సంవత్సరాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు మోడల్ రోడ్లు వేస్తున్నామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. గురువారం భోలక్‌పూర్ డివిజన్‌లోని భోలక్‌పూర్ హౌస్ వద్ద రూ.56లక్షలతో సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ గౌస్ ఉద్దీన్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రేటర్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, మైనార్టీ కమిటీ రాష్ట్ర నాయకుడు రహీం, భోలక్‌పూర్ హౌస్ అధ్యక్షుడు కేఎం.శంకర్, నాయకులు పాల్గొన్నారు.

మసీదుల వద్ద ఇబ్బందులు ఉండొద్దు

ముషీరాబాద్: రెండు రోజుల్లో ప్రారంభం కానున్న రంజాన్ మాసంలో మసీదుల వద్ద ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదేశించారు. గురువారం సాయంత్రం ముషీరాబాద్ ఆర్యవైశ్య భవన్‌లో జలమండలి, విద్యుత్, జీహెచ్‌ఎంసీ, పోలీసు ఉన్నతాధికారులు, వివిధ మసీదుల పెద్దలతో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంజుమన్ సొసైటీ ఛైర్మన్ అక్తర్‌అలీ, ఐరన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదంఅలీ, బడీమసీదు ముక్తవల్లీ నజీర్‌అలీ, బిలాల్ మసీద్ ముత్తవల్లీ దిల్‌బర్‌హుస్సేన్, జలమండలి జీఎం రామకృష్ణ, డీజీఎంలు పాల్గొన్నారు.

సామాజిక దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

చిక్కడపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు సామాజిక దృక్పథాన్ని పెంపొందించుకోవాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జి.రఘురామ్ అన్నారు. గురువారం చిక్కడపల్లిలోని పెండేకంటి న్యాయ కళాశాలలో నిర్వహించిన వార్షిక ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఈ సందర్భంగా స్టూడెండ్ మ్యాగజైన్ థర్డ్ ఎడిషన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు.వాసవి విద్యాసంస్థల అధ్యక్షుడు పి.రామమోహనరావు, అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఓయూ న్యాయవిభాగం అధిపతి ప్రొ.బి.విజయలక్ష్మి, సంయుక్త కార్యదర్శి ఆనంద్‌కుమార్, ప్రిన్సిపాల్ ప్రొ.పి.అరవింద, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత కోచింగ్, వసతి కల్పించాలి

రాంనగర్: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్, వసతి కల్పించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్‌ఐ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, అనగంటి వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం చిక్కడపల్లిలోని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు జావేద్, మల్లం మహేష్, సహాయ కార్యదర్శులు కృష్ణనాయక్, గడ్డం వెంకటేష్, జగన్, నాయకులు పాల్గొన్నారు.

56 బీసీ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలి



మంత్రి తుమ్మలకు వినతి పత్రం ఇస్తున్న భాగ్యలక్ష్మి

బర్కత్‌పుర, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 56 బీసీ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని ఓబీసీ సెంట్రల్ కమిటీ ఛైర్‌పర్సన్ ఎం.భాగ్యలక్ష్మి విజ్ఞప్తి చేశారు. ఛైర్మన్లు, డైరెక్టర్ పోస్టులలో 50 శాతం మహిళలకు కేటాయించాలని కోరారు. గురువారం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేసినట్లు కాచిగూడలోని సెంట్రల్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చేనేత సంఘం అధ్యక్షుడు రాపోలు వీరమోహన్, ప్రతినిధులు సునీత, జ్యోతి పాల్గొన్నారు.

వాలీబాల్ గ్రౌండ్ అభివృద్ధికి రూ.56లక్షలు

ముషీరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్‌లోని ప్రసిద్ధిగాంచిన వాలీబాల్ గ్రౌండ్‌లో ఓపెన్ జిమ్, క్రీడాకారులు కూర్చోడానికి గ్యాలరీల నిర్మాణానికి రూ.56లక్షలు, జాంబవినగర్‌లో పెండింగ్‌లోని సీసీరోడ్డు నిర్మాణానికి రూ.48లక్షలు మంజూరయ్యాయని కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ తెలిపారు. గురువారం జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలిసి ముషీరాబాద్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు బద్రినారాయణ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం

అంబర్‌పేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేటలోని వేర్వేరు ప్రాంతాల్లో గురువారం ఇద్దరు అదృశ్యమయ్యారు. బాగ్‌అంబర్‌పేట మల్లికార్జున్‌నగర్‌లో నివాసం ఉండే బీసు నరసింహ(41) ఓ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నాడు. అతనికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈనెల 5న ఆస్పత్రికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. నరసింహ తిరిగి ఇంటికి రాలేదు. ఈ మేరకు అంబర్‌పేట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● బాగ్‌అంబర్‌పేట బతుకమ్మకుంటలో నివాసం ఉండే కేతావత్ మంజుల కుమార్తె కేతావత్ నందిని(16) నల్లకుంటలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. నందిని డీడీకాలనీలోని తమ మామ ఇంట్లో ఉంటోంది. ఈనెల 6న మధ్యాహ్నం నందిని మెడికల్ షాప్‌కు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె తల్లి గురువారం అంబర్‌పేట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

కూల్చిన చోటే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

చిక్కడపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కూల్చినచోటే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని, ఇళ్లు కూల్చినరోజు నుంచి గాంధీనగర్ డివిజన్ స్వామివివేకానందనగర్ బస్తీవాసులు నిరసనదీక్ష చేస్తున్నారు. అయితే వారు గురువారం నిరాహారదీక్షలు ప్రారంభించారు. తొలిరోజు బస్తీ ప్రధానకార్యదర్శి ఎంబీ కృష్ణ కూర్చున్నారు. సాయంత్రం దీక్షలో ఉన్న కృష్ణకు దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి పి.శంకర్, రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపచేశారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

టీపీజీపీఎస్ మహిళా విభాగం రాష్ట్ర కమిటీ ఏకగ్రీవం

కవాడిగూడ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా, విద్యా, ఉద్యోగ రంగాల్లో రాణించేందుకు గంగపుత్రులు అందరూ ఐక్యంగా ఉద్యమించాలని తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం(టీపీజీపీఎస్) అధ్యక్షుడు గడప శ్రీహరి పిలుపునిచ్చారు. గురువారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర మహిళా విభాగం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెపారు.

ట్రాన్స్‌జెండర్ల సమస్యలను పరిష్కరించాలి

రాంనగర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ట్రాన్స్‌జెండర్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రజా సాంస్కృతిక వేదిక (టీపీఎస్‌కే) రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు ఆరోపించారు. గురువారం విద్యానగర్‌లో టీపీఎస్‌కే ఆధ్వర్యంలో రచన ముద్రబోయిన అధ్యక్షతన ట్రాన్స్‌జెండర్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అలెయన్స్ ఇండియా సాహస్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, ట్రాన్స్‌జెండర్స్ అసోసియేషన్ సభ్యులు కౌసర్, మధు, సింధు, కిరణ్‌కుమార్, మోనాలిసా పాల్గొన్నారు.

వరదనీటి కాలువ సమస్యను పరిష్కరించాలి

నల్లకుంట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌ను ఆనుకుని ఉన్న ఉస్మానియా యూనివర్సిటీ లోపల మోహినిచెరువు నుంచి మల్లికార్జున్‌నగర్ బస్తీ నుంచి భరత్ పెట్రోల్ బంక్ వరకు వరదనీటి కాలువలో సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి జీహెచ్‌ఎంసీ సర్కిల్ 16 ఈఈ శ్రీపర్‌రాజుకు సూచించారు. స్థానిక ప్రజల ఫిర్యాదు మేరకు గురువారం కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి, జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభం

అంబర్‌పేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులను ఆదేశించారు. అంబర్‌పేట డివిజన్ న్యూపటేల్‌నగర్‌లో రూ.6 లక్షల వ్యయంతో చేపట్టిన డ్రైనేజీ పైప్‌లైన్ పనులను గురువారం ఎమ్మెల్యే స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో అంబర్‌పేట డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్, నాయకులు పాల్గొన్నారు.

● అంబర్‌పేట డివిజన్ న్యూపటేల్‌నగర్‌లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ గురువారం పరిశీలించారు. స్థానికులకు ఇబ్బందులు కలగకుండా పనులు పూర్తి చేయాలని అధికారులను కోరారు.

28న ఉచిత సామూహిక ఉపనయనాలు : ఏబీసీడీఓ

చిక్కడపల్లి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అఖిల బ్రాహ్మణ సమాజ అభివృద్ధి సంస్థ(ఏబీసీడీఓ) చిక్కడపల్లి వారి ఆధ్వర్యంలో మార్చి 28న బ్రాహ్మణ 40వ ఉచిత సామూహిక ఉపనయనాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కీసరలోని అన్నపూర్ణ బ్రాహ్మణ నిత్య అన్నదాన సత్రంలో ఆరోజు ఉదయం నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందని ఏబీసీడీఓ ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం వివరించారు. కీసరగుట్ట అన్నపూర్ణ బ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రంవారి సౌజన్యంతో జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొనే ఆసక్తిగలవారు 9390646539, 9866154760, 9492877204, 9989048881 నెంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

రేపు, ఎల్లుండి తాగునీటి సరఫరాలో అంతరాయం

చిక్కడపల్లి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ పరిధిలో 9, 10 తేదీల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వాటర్‌వర్క్స్ గాంధీనగర్ మేనేజర్ కృష్ణమోహన్ తెలిపారు. హకీంపేట ఎంఈఎస్ వద్ద భారీ లీకేజీ ఏర్పడిందని, శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం అర్ధరాత్రి 12 వరకు మరమ్మతులు చేపడుతున్నారని ఆయన వివరించారు. దీంతో వివిధ ప్రాంతాలతోపాటు గాంధీనగర్, దోమలగూడ ప్రాంతాల్లో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.శంకర్

మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రాంనగర్, బర్కత్‌పుర, కవాడిగూడ, నల్లకుంట ప్రాంతాల్లో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. దక్షిణ భారత సేవా సమాజ్, నైన్ స్టార్ హెల్త్ ఆధ్వర్యంలో పేదలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నల్లకుంటలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఉదాన్ సభ్యుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మహిళా సాధికారతతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్ అన్నారు.

రాంనగర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ రాజ్యాంగం కల్పించిన హక్కులు, విధులు, ఉద్యోగాలు, ఇతర అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పిలుపునిచ్చారు. అడిక్‌మెట్‌లోని ఎస్‌వీఇఎస్ ప్రభుత్వ పాఠశాలలో బీఆర్‌ఎస్ నాయకులు కె.అనురాధ, కె.సురేందర్ ఆధ్వర్యంలో మహిళాదినోత్సవాన్ని నిర్వహించారు. వివిధ రంగాలకు చెందిన మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, నాయకులు డి.రవియాదవ్, బషీర్, అహ్మద్, జెల్ల మాధవి పాల్గొన్నారు.

పేదలకు ఉచిత వైద్య శిబిరం

బాగ్‌లింగంపల్లిలోని నైన్ స్టార్ హెల్త్ కేర్, దక్షిణ భారత సేవా సమాజ్ సంయుక్త ఆధ్వర్యంలో పేదలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని నైన్ స్టార్ హెల్త్ కేర్ డైరెక్టర్, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి కుమార్తె పైడి సుచరితరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలకు మందులు, , విద్యార్థులకు నోట్ బుక్స్, పాలిటెక్నిక్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేశారు.

బర్కత్‌పుర: మహిళా సాధికారతతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకర్ అన్నారు. ఫీవర్ ఆస్పత్రిలో తెలంగాణ వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. వైద్య రంగంలో మహిళలది గణనీయమైన పాత్ర ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వై.అమృత, ఆర్ఎంవో డాక్టర్ జయలక్ష్మి, డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ చంద్రశేఖర్, ఏవో మోహన్‌దాస్, యాదీలాల్, ఎం.విజయలక్ష్మి, టీఎంహెచ్ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు రాబర్ట్ బ్రూస్, ఫీవర్ ఆస్పత్రి యూనిట్ అధ్యక్షురాలు లావణ్య, ఉపాధ్యక్షురాలు పద్మజ పాల్గొన్నారు.

నల్లకుంట: లయన్స్ క్లబ్ ఆఫ్ ఉదాన్ సభ్యులు కనకదుర్గ, ఆలివేలు ఆధ్వర్యంలో బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని రామకృష్ణనగర్ కమ్యూనిటీ హాల్‌లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిడీపీరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో నాయకురాలు స్రవంతి, నిర్మల, పుష్ప, వాణి, బాలమణి, మీన పాల్గొన్నారు.



లయన్స్ క్లబ్ ఆఫ్ ఉదాన్ సభ్యుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేస్తున్న మహిళలు